

పసుపు రైతు పరేషాన్

పసుపు ధరలు రోజురోజుకూ పడిపోతున్నాయి. దీంతో పంట సాగు చేసిన రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు.

8లో▸



గర్భాలయం చుట్టూ రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు



ఆలయంలో సిడె ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

జై భవానీ..

తాండూరు మండలం కర్ణాటక సరిహద్దులో వెలసిన కోత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ జాతర కనుల పండువగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం రథోత్సవం, సిడె కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ సిడెను తిప్పుతూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా జై భవానీ నినాదాలతో ఆలయం మార్మోగింది. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి, సర్పంచ్ సాయిలు, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్రాంరెడ్డి, నేతలు రాంలింగారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, డాక్టర్ జయదీప్‌రెడ్డి, సురేశ్, గ్రామ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

– తాండూరు రూరల్

న్యూస్‌రీల్

నేడు బహుమతుల ప్రదానం

కొడంగల్: మండల స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ 2023 ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి శనివారం ఉదయం 10 గంటలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఎంపీడీఓ పాండు తెలిపారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు.

అన్ని కేంద్రాలను ప్రారంభించండి



అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: జిల్లాకు కేటాయించిన అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం సాయంత్రం లోపు ప్రారంభించాలని, రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ధాన్యం సేకరించాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాట్లు, ధాన్యం తరలింపు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరబోసిన ధాన్యాన్నే కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాలని రైతులకు సూచించారు. సంబంధిత అధికారులు నిత్యం సెంటర్లను సందర్శించి, సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారి రాజేశ్వర్, డీఆర్‌డీఓ కృష్ణన్, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ విమల, వ్యవసాయ అధికారి గోపాల్, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో ఇబ్బందులు కలిగించొద్దు



శివారెడ్డిపల్లిలో డీఏఓ గోపాల్

దోమ: రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. మండల పరిధిలోని శివారెడ్డిపల్లిలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. అమ్మిన ధాన్యానికి సంబంధించి రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓ గీత తదితరులు ఉన్నారు.

నేడు మర్పల్లికి మంత్రి సబితారెడ్డి

మర్పల్లి: విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి శనివారం మర్పల్లి మండలానికి రానున్నారని ఎంపీపీ బట్టు లలిత శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్‌తో కలిసి మండల పరిషత్ కార్యాలయం, గ్రంథాలయం, కల్‌ఖోడ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 10.30 మండల పరిషత్ ఆఫీస్, 11 గంటలకు గ్రంథాలయం. మధ్యాహ్నం 2 గంటలకు సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం ఉంటుందని, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

‘సమాజం’లో పోటీకి రోహిణి పోరాటం



తాండూరు వీరశైవ సమాజం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రోహిణి

తాండూరు: మహిళలు అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తున్నప్పటికీ.. కొన్ని చోట్ల ఇప్పటికీ వివక్ష కొనసాగుతూనే ఉంది. తాండూరు పట్టణంలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ సంఘటనే ఇందుకు నిదర్శనంగా నిలిచింది. పట్టణానికి చెందిన వీరశైవ సమాజం ఎన్నికల్లో పోటీ చేసేందుకు తనకు నామినేషన్ పత్రాలు ఇవ్వాలని కోరుతూ పాత తాండూరుకు చెందిన రోహిణి సంఘం కార్యాలయానికి వెళ్లారు. అయితే మహిళలకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం లేదని సమాజం ప్రతినిధులు చెప్పారు. దీంతో ఆమె ఆఫీసు వద్దే నిరసన చేపట్టారు. సుమారు 5గంటల పాటు అక్కడే కూర్చున్నారు. వీరశైవ సమాజంలో మహిళలు ఎందుకు పోటీ చేయకూడదని నిలదీశారు. ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది. దీనిపై స్పందించిన సమాజం ప్రతినిధులు కమిటీలో మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించడంతో రోహిణి నిరసన విరమించారు.

అసైన్డ్‌కు ఎసరు!



సర్వే నంబర్ 52లోని అసైన్డ్ భూమి చుట్టూ నిర్మించిన ప్రహరీ

కోట్లాది రూపాయల విలువైన భూమి అన్యాక్రాంతం

- స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం
- శ్మశానవాటికకు కేటాయించామని బుకాయింపు
- అధికారిక అనుమతులు లేకుండానే పనులు
- రూలింగ్ పార్టీ నేత కనుసన్నల్లోనే వ్యవహారం

తాండూరు: పట్టణ శివారులోని తాండూరు– హైదరాబాద్ మార్గంలో ఉన్న విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. వీటిని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్మశానవాటికల పేరిట స్థలాలను సేకరిస్తూ కొంత కాలం తర్వాత వ్యాపార సముదాయాలను నిర్మించి అక్రమాలకు తెరలేపుతున్నారు. గతంలో ఇందిరాచౌక్ ప్రాంతంలోని లింగాయత్ శ్మశానవాటిక, బీసీ శ్మశాన వాటికలకు కేటాయించిన స్థలాల్లో షటర్లు వేసి వ్యాపారులకు కట్టబెట్టారు. ఇదే తరహాలో ప్రస్తుతం యాలాల మండలం కోకట్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 56లో ఉన్న ప్రభుత్వ భూమి అన్యాక్రాంతానికి పాల్పడటం వివాదాస్పదమైంది.



రాజీవ్ గృహకల్ప వద్ద కబ్జా చేసిన స్థలంలో గోడ నిర్మాణానికి తీసిన పునాది

ఇళ్ల మధ్య శ్మశానం ఏమిటి..?

కోకట్ రెవెన్యూ గ్రామ పరిధిలో 400 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ప్రభుత్వం కొంతమంది రైతులకు పట్టాలు అందజేసింది. ఈ స్థలాలన్నీ హైదరాబాద్ రూట్‌లో ఉండటంతో ప్రస్తుతం వీటి విలువ భారీగా పెరిగింది. సర్వే నంబర్ 52లో 81 ఎకరాల భూమి ఉండగా గత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందులోని కొంత స్థలాన్ని రాజీవ్ గృహకల్ప సముదాయానికి కేటాయించింది. ఇక్కడ పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చింది. ఆ పక్కనే రెండెకరాల స్థలంలో ఉన్న అసైన్డ్ రైతుకు కొంత మొత్తం ముట్టజెప్పి తప్పించారు. ఆతర్వాత తాండూరుకు చెందిన ఓ సామాజిక వర్గం వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని వైకుంఠధామం కోసం అప్పగించినట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారినట్లు సమాచారం. ఇదిలా ఉండగా కాలనీ పక్కనే వైకుంఠధామానికి స్థలం కేటాయించడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇళ్ల మధ్య శ్మశానవాటిక ఏమిటని నిలదీస్తున్నారు. ఈ వ్యవహారమంతా అధికార పార్టీకి చెందిన ప్రముఖ నేత కనుసన్నల్లోనే జరుగుతోందనే ఆరోపణలున్నాయి.

అనుమతులు లేకుండానే..

రాజీవ్‌కాలనీ వద్ద వైకుంఠధామం నిర్మాణానికి రెవెన్యూ శాఖ అధికారులు భూమిని కేటాయించకుండానే పనులు మాత్రం కొనసాగుతున్నాయి. కొంత మంది అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోవడం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

సెలవుపై తహసీల్దార్

యాలాల తహసీల్దార్ గోవిందమ్మ నాలుగు రోజుల క్రితం సెలవుపై వెళ్లారు. భూ కబ్జాపై స్థానిక రాజకీయ పార్టీల నాయకులు ఆమెపై ఒత్తిడి చేయడంతో చేసేది లేక ఆమె సెలవుపై వెళ్లినట్లు తెలుస్తోంది.

కలెక్టర్‌కు నివేదిక

ఈ విషయమై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డిని వివరణ కోరగా సర్వేనంబర్ 52లో శ్మశానవాటిక నిర్మాణం కోసం తమకు ఎలాంటి లోని స్మశాన వాటికకు స్థలం కేటాయింపుకు అనుమతులు రాలేదన్నారు. రెండెకరాల స్థలంలో ప్రహరీ నిర్మిస్తున్నట్లు కలెక్టర్‌కు నివేదిక పంపిస్తున్నామని తెలిపారు. ఇదే విషయమై ఆర్డీఓ అశోక్‌కుమార్‌ను అడగగా తనకు స్పష్టత లేదని చెప్పారు.

ప్రతీ ఎకరాకు నీరందాలి



రాళ్లగుడుపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- లీకేజీలను సరిచేసి, కాల్వల్లో పూడిక తీయాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- నందివాగు కుడి కాల్వ పనుల పరిశీలన

మోమిన్‌పేట: చెరువుల కాల్వలు బాగుంటేనే అందరి పొలాలకు సాగు నీరు అందుతుందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కాస్లాబాద్, రాళ్లగుడుపల్లి గ్రామాల్లో శుక్రవారం నందివాగు ప్రాజెక్టు కుడి కాల్వ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాల్వలో గడ్డి, పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తేనే చివరి పొలాలకు నీరందుతుందని తెలిపారు. నీటి పారుదలకు ఆటంకాలు లేకపోతే ఏటా రెండు పంటలు పండించుకునే వీలుంటుందన్నారు. చెరువుల్లోని నీరు వృథా కాకుండా, ప్రతీ ఎకరాకు అందేలా చూడాలని సూచించారు. చెరువు కట్టపై పొదల తొలగింపు, కాల్వల మరమ్మతు, పూడికతీత పనులను ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం పనులు చేయించి ఉపాధి కూలీలకు తగిన డబ్బులు అందేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పనులు ప్రారంభించిన నాటి నుంచి కూలీల వినిమయ శక్తి పెరిగిందని తెలిపారు. అనంతరం కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కాస్లాబాద్ కుడి కాల్వకు పడిన లీకేజీని సరిచేయడంతో పాటు పూడికతీత, పొదల తొలగింపు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. అనంతరం మోమిన్‌పేటలోని పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అక్కడినుంచి తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలను సందర్శించారు. ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయం బయట ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఓ కృష్ణన్, డీఎల్‌పీఓ అనిత, డీఏఓ గోపాల్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ శైలజారెడ్డి, ఎంపీఓ యాదగిరి, ఇరిగేషన్ ఏఈఈ వరప్రసాద్, పీఆర్ ఏఈఈ ప్రణీత్‌కుమార్, సర్పంచులు సావిత్రమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, అర్‌ఐ రాజు, కార్యదర్శులు నర్సింలు, రజిత, అన్నపూర్ణ, ఏపీఓ శంకర్, ఏపీఎం రాజు తదితరులు ఉన్నారు.

‘డబుల్’ సర్కార్ ఖాయం



ఎస్‌బీపల్లి–కొత్తపేట రోడ్డు వివరాలు తెలుసుకుంటున్న కేంద్రమంత్రి మహేంద్రనాథ్ పాండే

- రాష్ట్రంలో రూ.6,500 కోట్లతో రహదారుల అభివృద్ధి
- హామీల అమలులో కేసీఆర్ విఫలం
- కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే

షాద్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే అన్నారు. పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం కొత్తూరు మండలం ఎస్‌బీపల్లి నుంచి కొత్తపేట వరకు కేంద్ర నిధులు రూ.20కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం షాద్‌నగర్‌లోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో మేధావుల సమ్మేళనంలో పాల్గొన్నారు. కొత్తూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు కావడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఆ పార్టీ నేతల అవినీతి, అక్రమాలను ప్రజలకు వివరిస్తామన్నారు. బీజేపీ సర్పంచులు ఉన్న గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జనాభా ప్రాతిపదికన పల్లెల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. తెలంగాణలో జాతీయ రహదారులతో పాటు రాష్ట్ర రహదారుల అభివృద్ధి కోసం కేంద్రం ఐదేళ్ల కాలంలో రూ.6,500 కోట్లు మంజూరు చేసిందన్నారు. శంషాబాద్ నుంచి బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ కోసం కేంద్రం రూ.900 కోట్లు కేటాయించిందని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి కోసం భారీ ఎత్తున నిధులను మంజూరు చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్, మిథున్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, దేపల్లి అశోక్‌గౌడ్, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

శక్తివంతమైన దేశంగా భారత్

ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ప్రపంచంలోనే భారత్ శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేధావులతో నిర్వహించిన సమావేశం ఆయన మాట్లాడారు. దేశంలో ఉగ్రవాద నిర్మూలన, పాకిస్తాన్, చైనా ఆక్రమణలను అడ్డుకునేందుకు కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అన్నారు. దేశంలోకి చొరబాట్లను నియంత్రించేందుకు గాను దేశ సరిహద్దులో రక్షణ వ్యవస్థలను పటిష్టం చేయడంతో పాటు, జవాన్ల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. దేశంలోని అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు.

పరిశ్రమలతోనే స్వయం సమృద్ధి

- కలెక్టరేట్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ఎక్స్‌పో
- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్

సాక్షి,రంగారెడ్డిజిల్లా: పరిశ్రమల ఏర్పాటుతోనే స్వయం సమృద్ధి సాధ్యమని రంగారెడ్డి జెడ్పీ చైర్ పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం కొంగరలోని జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ఎక్స్‌పో’ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లా డుతూ.. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లతో చిన్నతనంలోనే మధుమేహం, అధిక రక్తపోటు వంటి వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. సూక్ష్మ ఆహార తయారీ పరిశ్రమల ఏర్పాటుతో స్వయం ఉపాధి పొందడంతో పాటు, ఆయిల్, పప్పులు, ఇతర ఆహార పదార్థాలను ఇంట్లోనే స్వయంగా తయారు చేసుకోవచ్చని చెప్పారు. తద్వారా ఆహార కల్తీని నియంత్రించడమే కాకుండా దీర్ఘకాలిక వ్యాధుల బారినపడకుండా ఆరోగ్యాన్ని కాపాడు కోవచ్చని సూచించారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి, తయారీదారుల క్రమబద్ధీకరణ పథకం ద్వారా ప్రభుత్వం ఔత్సాహికు లకు సబ్సిడీపై రుణాలు ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం మహిళా సమాఖ్య గ్రూపులకు రూ.పది లక్షల వరకు రుణం అందజేస్తోందన్నారు.

మహిళా సమాఖ్యలకు అవకాశం

అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. రైతులు ఆగ్రోబేస్ వస్తువులు తయారు చేసి ఆర్థికంగా ఎదగొచ్చన్నారు. కలెక్టరేట్‌లో మహిళా సమాఖ్య గ్రూపులకు కూరగాయాలు అమ్ముకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. పోచంపల్లి చేనేత వస్త్రాలతో పాటు చిరు ధాన్యాలు అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. బ్యాంకుల నుంచి సబ్సిడీతో కూడిన రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆహార పరిశ్రమలను ప్రోత్సహించాలనే ఆలోచనతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల కింద తోడ్పాటును అందిస్తున్నాయన్నారు.



ఉత్పత్తులను పరిశీలిస్తున్న అనితారెడ్డి

నీడ లేదు.. నీళ్లు లేవు!

- పని ప్రదేశంలో ఉపాధి కూలీల అవస్థలు
- పత్తాలేని టెంట్లు, మెడికల్ కిట్లు
- పదేళ్లుగా అందని పని సామగ్రి
- ఆందోళనలో కూలీలు

కొడంగల్ రూరల్: పని ప్రదేశంలో కనీస వసతులు కరువై ఉపాధి కూలీలు అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై అధికారులు పెద్దగా దృష్టిసారించడం లేదు. మండుటెండలో పనిచేస్తున్న కూలీలు సేద తీరేందుకు టెంట్లు లేవు. దీంతో సమీపంలోని చెట్ల కిందకు వెళ్తున్నారు. కనీసం తాగేందుకు నీళ్లు కూడా అందుబాటులో పెట్టడం లేదు. ఇంటినుంచి తీసుకెళ్లిన బాటిల్ అయిపోయిందంటే దాహంతో అలమటించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వేసవి భత్యం బంద్

ఉపాధి నిబంధనల ప్రకారం పని జరిగే చోట టెంట్లు ఏర్పాటుచేయాలి. ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి. ఇవేవీ లేకపోవడంతో ఇబ్బందుల నడుమ పని చేస్తున్నామని కూలీలు పేర్కొంటున్నారు. ఎండలో పని చేసే కూలీలకు వేసవి భత్యం కింద గతంలో ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్ నెలలో 30శాతం అదనపు కూలీ చెల్లించేవారు. కానీ రెండేళ్లుగా అదనపు భత్యం చెల్లించడం లేదని కూలీలు చెబుతున్నారు.



టేకుల్‌కోడ్‌లో ఫాంపాండ్ పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

సౌకర్యాలు లేక ఇబ్బందులు

పనులు జరిగే చోట తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు, టెంట్లు లేకపోవడంతో కూలీలు అస్వస్థతకు గురైతే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా పనులు చేసేందుకు అవసరమైన పారలు, గడ్డపారలు, తట్టలు అందించడం లేదు. పదేళ్లుగా వీటి పంపిణీ ఊసే లేదు. దీంతో కూలీలు తమ సొంత డబ్బులతో సామగ్రి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అదనపు జీతభత్యాలు ఇవ్వడంతో పాటు వసతులు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పదేళ్ల క్రితం ప్రభుత్వం టెంట్లు పంపిణీ చేసింది. పాత టెంట్లను పని ప్రదేశంలో వేయమని క్షేత్ర సహాయకులకు, పంచాయతీ కార్యదర్శులకు చెప్పాం.

– రాములు, ఏపీఓ కొడంగల్

క్లుప్తంగా

డీసీఎం వాహనం దగ్ధం



టేకులపల్లి వద్ద మంటల్లో డీసీఎం వాహనం

మోమిన్‌పేట: అగ్ని ప్రమాదంలో డీసీఎం వాహనం దగ్ధమైన ఘటన మోమిన్‌పేటలో శుక్రవారం చోటు చేసుకొంది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ఎన్కతల గ్రామానికి చెందిన గాండ్ల రమేశ్ తన డీసీఎం వాహనంలో సుద్దోడ్కతండాలో చొప్పను నింపుకొన్నారు. తిరిగి ఎన్కతలకు వస్తుండగా టేకులపల్లి సమీపంలోకి రాగానే చొప్ప తగులబడింది. వెంటనే అప్రమత్తమైన రమేశ్ సదాశివపేటలోని ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయగా సిబ్బంది వచ్చారు. వికారాబాద్ నుంచి కూడా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి వేశారు. కాని అప్పటికే వాహనం కాలిపోయింది. దాని పైనే ఆధారపడి కుటుంబ పోషణ చేస్తున్న రమేశ్ రోడ్డున పడ్డానని లబోదిబోమన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ప్రతీ ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరి

కుల్కచర్ల: ప్రతీ ఇంటా తప్పనిసరిగా మరుగుదొడ్డి నిర్మించుకోవాలని, అదేవిధంగా ఇంకుడుగుంతలు ఏర్పాటుచేసుకోవాలని ఏపీఓ వెంకటేశ్, చెల్లాపూర్ సర్పంచ్ చంద్రయ్య అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కుల్కచర్ల మండలం చెల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇంటింటికీ వెళ్లి మరుగుదొడ్లు నిర్మించుకోవాలని అవగాహన కల్పించారు. మరుగుదొడ్లు నిర్మించుకోవడం అనేది బాధ్యతగా భావించాలని, మహిళల గౌరవాన్ని కాపాడేందుకు ప్రతీ కుటుంబం ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో స్థానిక గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు వ్యక్తుల బైండోవర్

యాలాల: నకిలీ విత్తనాల కేసులో గతంలో పట్టుబడిన వ్యక్తులను యాలాల పోలీసులు శుక్రవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మండలానికి చెందిన రాములు, శ్రీనివాస్, వేమారెడ్డిలు గతంలో నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేస్తుండగా పోలీసులు పట్టుకొని కేసులు నమోదు చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా పై ముగ్గురిని శుక్రవారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ అరవింద్‌కుమార్ తెలిపారు.

పారిశుద్ధ్యంపై అశ్రద్ధ తగదు

డీఎల్‌పీఓ శంకర్‌నాయక్



సిరిగిరిపేట్‌లో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

తాండూరు రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామని డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సిరిగిరిపేట్, రాంపూర్‌మీదితండా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ వచ్చే వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందోస్తుగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామని చెప్పారు. గ్రామాల్లో మురుగు కాల్వల్లో మురుగు తొలగింపు ,ప్రతి వార్డు పరిశుభ్రంగా ఉండాలన్నారు.కంపోస్ట్‌షెడ్డు వద్ద తడి, పొడిచెత్తను వేరు చేయాలని ఆదేశించారు. ఏ గ్రామంలోనైనా పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓ రతన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పసుపు రైతు పరేషాన్



పొలంలో పసుపు దిగుబడులు

మద్దతు ధర లేక అవస్థలు
- పెట్టుబడులు రాని దుస్థితి
- ఏటేటా సాగు తిప్పలే

పెద్దేముల్: పసుపు ధరలు రోజురోజుకు పడిపోతున్నాయి. దీంతో రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. నాడు పసిడి(బంగారం)తో పోటి పడిన పసుపు నేడు ధర పూర్తిగా పడిపోయింది. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు పెంచడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు ఆరేళ్లుగా 5వేల నుంచి రూ.6,500 మధ్య స్థిరంగా సాగుతుంది. పెట్టుబడులు రెండింతలు పెరిగినా ధర మాత్రం పెరగటం లేదని రైతన్నలు వాపోతున్నారు. జిల్లాలోని పెద్దేముల్, బంట్వారం, మోమిన్‌పేట, మర్పల్లి, కోటపల్లితో పాటు పలు మండలాల్లో రైతులు ఏటా అధికంగా సాగుచేస్తున్నారు. పెద్దేముల్ మండలంలో నాగులపల్లి, గోపాల్‌పూర్, ఇందూరు, తింసాన్‌పల్లి ఆత్కూర్, బండమీదిపల్లి, తట్టెపల్లితో పాటు పలు గ్రామాలల్లో రైతులు పసుపు పంటను సాగుచేస్తారు. ధర లేకున్నా, దిగుబడి బాగా ఉండటంతో సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఏటా కూలీల ఖర్చులు, రసాయన ధరలు, ట్రాక్టర్ల అద్దెలు రెండింతలు పెరిగాయి. అయినా ప్రభుత్వం మాత్రం మద్దతు ధర పెంచడం లేదని రైతులు వాపోతున్నారు. ఇరువై ఏళ్ల క్రితం క్వింటాలు ధర రూ.18వేలు పలికిందని రైతులు పేర్కొంటున్నారు. మళ్లీ ఆ అవకాశం వస్తుందన్న ఆశతో కొన్నేళ్లుగా పసుపు పంటను క్రమం తప్పకుండా సాగుచేస్తున్నారు. కానీ రూ.5వేల నుంచి రూ. 7వేలు దాటడం లేదని అంటున్నారు. ఇప్పటికి గ్రామీణ ప్రాంత రైతులు పాత పద్ధతిలోనే పంటను సాగుచేస్తున్నారు. పసుపు కొమ్మలను తవ్వి వాటిని వెలికి తీసి ఉడికించడం వంటి పనులు సుమారు 20 రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఇది చాలా కీలకమైన పని. ఎంతో జాగ్రత్తగా చేయాలి. చిన్న పాటి చినుకు పడినా పసుపు పాడవుతుంది. సక్రమంగా ఉడకపోయినా పసుపు ఎండదు. ఎకరం సాగుకు సుమారు రూ.60వేలకు పైగా ఖర్చు వస్తుంది. అందుకు ప్రభుత్వం కనీసం క్వింటాలుకు రూ.12వేలకు పైగా విక్రయాలు జరిగితే కాసింత లాభం ఉంటుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం రూ.5,200 ధరతో విక్రయాలు జరుగుతుండటంతో పెట్టిన పెట్టుబడులే వస్తున్నాయని రైతన్నలు అంటున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. పండించిన పంటను విక్రయించేందుకు మార్కెట్ సైతం అందుబాటులో లేకపోవడంతో వికారాబాద్ ప్రాంతాలకు వెళ్లి విక్రయిస్తున్నారు.

మూడు దశాబ్దాల కల నెరవేరింది



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

- 111 జీవో ఎత్తివేయడం చరిత్రాత్మకం
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి
- మొయినాబాద్‌లో ఘనంగా సంబరాలు

మొయినాబాద్: 111 జీవో ఎత్తివేతతో 84 గ్రామాల ప్రజల కల నెరవేరిందని చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. 111 జీవోను ఎత్తివేస్తూ మంత్రి వర్గం నిర్ణయం తీసుకోవడంపై శుక్రవారం మొయినాబాద్‌లో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఎమ్మెల్యే యాదయ్య మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. 111 జీవో ఎత్తేస్తామని సీఎం కేసీఆర్ మాట ఇచ్చారని.. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. జీవో పరిధిలోని ప్రాంతం మినీ హైదరాబాద్ నగరంగా నిర్మితమవుతుందన్నారు. జీవో ఎత్తివేయడం చారిత్రక నిర్ణయమన్నారు. ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. 111 జీవో ఎత్తివేయడం హర్షణీయమన్నారు. జీవో ఎత్తివేతతో 84 గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యాక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు రానివ్వం



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- రైతులకు అవసరమైనన్నీ గోనె సంచులు ఇవ్వండి
- తూకంలో మోసాలకు పాల్పడితే చర్యలు
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్: రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆదేశించారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో కొనుగోలు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఏఎంసీ నిర్వాహకులపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. గోనే సంచులు ఇవ్వడం లేదన్నారు. తూకంలో మోసం జరుగుతుందని రైతులు ఆరోపించారు. కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎమ్మెల్యే ముందు వాపోయారు. రైతులకు న్యాయం చేయాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాల ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. రైతులకు అవసరమైన గోనే సంచులు ఇవ్వాలన్నారు. ధాన్యం తరలించడం కోసం వాహనాలను ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మధుసూదన్‌రావ్ యాదవ్, శంకర్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, భీములు, దేవదత్తు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



వికారాబాద్‌లోని ఎరువుల దుకాణంలో అధికారుల తనిఖీలు



కొడంగల్: తనిఖీలు చేస్తున్న అధికారులు

అనంతగిరి: వికారాబాద్ మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. నకిలీ విత్తనాలు, నకిలీ మందులు అమ్మరాదని డీలర్లకు సూచించారు. ఒకవేళ అమ్మితే వారిపై పీడీయాక్టు కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ వినోద్‌కుమార్, ఏఓ జ్యోతి, రమేశ్, సీఐ అప్పయ్య, ఎస్ఐలు సత్యనారాయణ, భరత్‌లు ఉన్నారు.

రశీదు తప్పనిసరిగా తీసుకోండి..

దౌల్తాబాద్: ఫెర్టిలైజర్ షాపుల్లో నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని ఏఓ లావణ్య అన్నారు. శుక్రవారం మండలంలోని బాలంపేట, గోకఫసల్‌వాద్ గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో పోలీస్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఎరువులు, విత్తనాల కొనుగోలు చేసిన దుకాణాల్లో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేశ్‌కుమార్, ఏఈఓ శ్రీపతిరెడ్డి తదితరులున్నారు.

కొడంగల్ పట్టణంలో ..

కొడంగల్: పట్టణంలోని ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. ఓం ట్రేడింగ్ కంపెనీ, రాఘవేంద్ర ఫెర్టిలైజర్, వైష్ణవి ఎరువుల దుకాణంతో పాటు పలు దుకాణాల్లో సోదాలు చేశారు. మండల వ్యవసాయాధికారి బాలాజీ ప్రసాద్, ఎస్ఐ రవిగౌడ్‌లు తనిఖీ చేశారు. వానాకాలం సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించకుండా ముందస్తుగా తనిఖీలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎవరైనా నకిలీ, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం

రూ.3 లక్షల ఆస్తి నష్టం



దగ్ధమైన పూరి గుడిసె

యాచారం: ప్రమాదవశాత్తు మంటలంటుకుని పూరిగుడిసె దగ్ధమైంది. మండల పరిధిలోని మాల్ గ్రామంలోని బుడగ జంగాల కాలనీలో మోతె కృష్ణకు చెందిన పూరి గుడిసెకు శుక్రవారం ఉదయం మంటలంటుకున్నాయి. గమనించి చల్లార్చే ప్రయత్నం చేస్తుండగానే గుడిసె పూర్తిగా కాలిపోయింది. నిత్యం రెక్కాడితే గాని డొక్కాడని మోతె కృష్ణ, సాలమ్మ దంపతులు గుడిసె దగ్ధంతో నిరాశ్రాయులుగా మారారు. గుడిసెలో ఉన్న దాదాపు రూ.3 లక్షల విలువ జేసే దుస్తులు, వంట సామగ్రి, బియ్యం, పప్పులు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. గ్రామస్తులు తహసీల్దార్ సుచరితకు సమాచారం అందించారు. గ్రామానికి చెందిన స్వచ్ఛంధ సేవా కార్యకర్త గండ్లపల్లి మురళీ రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు, మోతె కృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన అధికారులను కోరారు.

సంబరాల్లో అపశ్రుతి

బాణసంచా కాలుస్తుండగా గాయపడిన బాలుడు

మొయినాబాద్: ప్రభుత్వం 111 జీఓ ఎత్తివేసినట్లు ప్రకటించడంతో నిర్వహిస్తున్న సంబరాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. బాణాసంచా కాలుస్తుండగా టపాసు ఎగిరి బస్సులో పడటంతో ఓ బాలుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన మొయినాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. 111 జీఓ ఎత్తివేసినట్లు ప్రభుత్వం ప్రకటించడంతో శుక్రవారం మొయినాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య సంబరాల్లో పాల్గొనడంతో పెద్ద ఎత్తున్న బాణాసంచా పేల్చారు. టపాసులు ఎగిరి రోడ్డుపై వెళ్తున్న వాహనాలపై పడ్డాయి. ఇదే క్రమంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రకాశ్‌చారి కుమారుడు యశ్వంత్(3)పై పడ్డాయి. దీంతో అతని చాతి భాగంలో గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

గన్నీ బ్యాగుల కోసం రైతుల నిరసన



దుద్యాలలో రైతుల నిరసన

బొంరాస్‌పేట: అసలే వరిధాన్యం కొనుగోళ్లను ఆలస్యంగా ప్రారంభించినప్పటికీ గన్నీ బ్యాగులు అందక అవస్థలు పడుతున్నామని దుద్యాల మండల కేంద్రంలో రైతులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. దుద్యాల మండల కేంద్రంలోని రైతు వేదిక లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. నేటికీ గన్నీ బ్యాగులు అందడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అల్లిఖాన్‌పల్లి, వాల్యానాయక్‌తండా, సోమ్లానాయక్‌తండా, హస్నాబాద్ రైతులు గన్నీ బ్యాగుల కోసం నిత్యం వచ్చి వెనుదిరిగి వెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇపప్పటికైనా అందేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

జంట జలాశయాల చేరువలో లేక్‌సిటీ

- జీవో 111 ఎత్తివేత నేపథ్యంలో త్వరలో మరో కొత్త జీఓ
- ఇందులోని విధివిధానాల మేరకు హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్
- సగానికి పైగా తగ్గనున్న జంట జలాశయాల బఫర్‌జోన్

సాక్షి, సిటీబ్యూరో: జీవో 111ను పూర్తిగా ఎత్తివేసిన నేపథ్యంలో హైదరాబాద్ మహానగరాన్ని ఆనుకొని మరో అద్భుతమైన లేక్‌సిటీ నిర్మాణానికి కార్యాచరణ ఆరంభమైంది. ఆకాశాన్నంటే హైరైజ్‌డ్ బహుళ అంతస్తుల భవనాలతో జంట జలాశయాలకు చేరువలో ఈ లేక్‌సిటీ రూపుదిద్దుకోనుంది. హెచ్‌ఎండీఏ నిబంధనలకు అనుగుణంగానే జీవో 111 పరిధిలోని గ్రామాల్లో భవన నిర్మాణాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ఐటీ పరిశ్రమలు తదితర నిర్మాణాలకు అనుమతులనివ్వనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించిన దృష్ట్యా ఆ దిశగా హెచ్‌ఎండీఏ కసరత్తు చేపట్టింది. ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్ ప్రకారమే హెచ్‌ఎండీఏ పరిధిలో నిర్మాణ అనుమతులను అందజేస్తున్నారు. ఇదే పద్ధతిలో 111 జీవో పరిధి లోని 84 గ్రామాల్లో కూడా నిర్మాణాలను చేపట్టేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల పరిరక్షణ కోసం తెచ్చిన జీవో 111 పూర్తిగా ఎత్తివేసిన దృష్ట్యా ప్రభుత్వం మరో కొత్త జీఓను తేవాల్సి ఉంది. 'కొత్త జీఓలోని విధివిధానాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ ఉంటుందని హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇందు కోసం కొంత సమయం పట్టవచ్చునన్నారు. మరోవైపు గత సంవత్సరం ఏప్రిల్ 20వ తేదీన జీవో 111 ఎత్తివేస్తూ దానిస్థానంలో జీఓ 69 విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా ప్రణాళికాబద్ధమైన నగర నిర్మాణం కోసం ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ ఇటీవల సమర్పించిన నివేదికను అనుగుణంగానే కొత్త మాస్టర్‌ప్లాన్‌కు రూపకల్పన చేయనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారి పేర్కొన్నారు.

బఫర్‌జోన్ పరిధి..

ప్రస్తుతం జంట జలాశయాలకు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏడు మండలాల పరిధిలోని 84 గ్రామాలలో జలాశయాల పరిరక్షణ దృష్ట్యా నిర్మాణాలను నిషేధించిన సంగతి తెలిసిందే. 111 జీఓ ఎత్తివేత దృష్ట్యా రెండు జలాశయాల బఫర్ జోన్ పరిధిని భారీగా కుదించే అవకాశం ఉంది. మురికి నీరు చెరువుల్లోకి చేరకుండా రింగ్‌మెయిన్ వంటి నిర్మాణాలతో పాటు, మురికి నీటి శుద్ధిప్లాంట్‌లను కూడా ఏర్పాటు చేయనున్నందున బఫర్‌జోన్‌ను 5 కిలోమీటర్ల కంటే తక్కువ పరిధికి విస్తరించే అవకాశం ఉంది. దీంతో ఇప్పటి వరకు 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాల్లో భారీఎత్తున నివాస ప్రాంతాలు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు ఇప్పటికే చేపట్టిన అక్రమ కట్టడాలన్నింటికీ అనుమతులు లభించొచ్చు. మొయినాబాద్, శంషాబాద్, షాబాద్, కొత్తూరు, శంకర్‌పల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల మండలాల పరిధిలో పరిధిలో సుమారు 1.32 లక్షల ఎకరాల భూమి వినియోగంలోకి రానుంది. ఇందులో ప్రస్తుతం బయోకన్సర్వేషన్‌జోన్‌లో ఉన్న 90 శాతం భూమిపైన ఆంక్షలు తొలగడంతో భారీ ఎత్తున నిర్మాణ అనుమతులు లభించను న్నాయి. త్వరలో రానున్న కొత్త జీఓ సూచించే విధివిధానాల ప్రకారం బయోకన్సర్వేషన్ జోన్‌ను వినియోగంలోకి తెచ్చేవిధంగా మాస్టర్ ప్లాన్ ఉంటుందని అధికారులు చెప్పారు. సుమారు లక్ష ఎకరాల ప్రైవేట్ భూమిలో 75 శాతం వరకు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. 'ప్రస్తుతం నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న చెరువులు, కుంటలు, తదితర జలవనరులు, అడవులు, పర్యావరణ పరిరక్షణకు జీవ వైవిధ్య సమతుల్యతకు పాటిస్తున్న ప్రమాణాలనే 111జీవో పరిధిలోనూ అమలు చేస్తూ మాస్టర్ ప్లాన్ కు రూపకల్పన చేస్తాం' అని అధికారులు చెప్పారు.

పల్లె సమగ్ర కేంద్రాల పనితీరు భేష్

ప్రపంచ బ్యాంకు టీం సభ్యులు

మంచాల: ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన పల్లె సమగ్ర కేంద్రాల పనితీరు బాగుందని ప్రపంచ బ్యాంకు టీంసభ్యులు అన్నారు. మండల పరిధిలోని ఆగాపల్లిలో శుక్రవారం పల్లె సమగ్ర కేంద్రాన్ని వారు సందర్శించారు. స్థానిక డ్వాక్రా సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు పల్లె సమగ్ర కేంద్రం ద్వారా ఎలాంటి సేవలు అందుతు న్నాయి.. ప్రజలకు ఏవిధంగా ఉపయోగపడుతుంది అని ఆరా తీశారు. స్థానికంగా ఉన్న పల్లె సమగ్ర కేంద్రంలో బ్యాంకు మాదిరిగానే డబ్బులు చెల్లించడం, తీసుకోవడం ఉంటుందన్నారు. ప్రధానంగా మహిళలకు ఎంతో ప్రయో జనకరం అన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా డ్వాక్రా సంఘాలు ముందుకు సాగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రపంచ బ్యాంకు టీం సభ్యులు అమిత్ అరోరా, జయేశ్‌తండలే, వర ప్రసాద్, మహిమగుప్తా, ఎంపీడీఓ శ్రీనివాస్, స్త్రీ నిధి రీజినల్ మేనేజర్ ఉదయ కుమారి, ఏపీఎం శోభ, పంచాయతీ కార్య దర్శి అనిల్, స్త్రీనిధి మేనేజర్ సత్యం, సీసీలు సుజాత, జైపాల్‌రెడ్డి, లాల్‌సింగ్, వీఓఏలు సంతోష, పద్మ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో కొర్రీ



మిల్లర్ల సిండికేట్
- తరుగుకు ఒప్పుకొంటే 'ఏ' లేదంటే 'బీ' గ్రేడ్ ధర
- అంగీకరిస్తే క్వింటాలుకు రూ.2,040, లేకుంటే రూ.1,800
- ఇప్పటికీ కల్లాల్లోనే మెజార్టీ ధాన్యం
- పట్టించుకోని సివిల్ సప్లయ్ అధికారులు
- ఆందోళనలో అన్నదాతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అకాల వర్షాలకు ఇప్పటికే భారీగా నష్టపోయిన రైతులను మిల్లర్లు మరింత దెబ్బతీస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టి పంపిన ధాన్యాన్ని దింపకుండా సతాయిస్తున్నారు. తేమతో సంబంధం లేకుండా క్వింటాల్‌కు పది కిలోల తరుగుకు ఒప్పుకొంటే 'ఏ' గ్రేడ్‌గా, లేదంటే 'బీ' గ్రేడ్‌గా పరిగణిస్తున్నారు. దీనికి అంగీకరించిన రైతులకు క్వింటాల్‌కు రూ.2,040 చొప్పున చెల్లించేందుకు అంగీకరించి, నిరాకరించిన వాళ్లకు రూ.1,800 చొప్పున చెల్లిస్తున్నారు. ఇచ్చిన ఆప్షన్లకు తలొగ్గి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. సివిల్ సప్లయ్ అధికారులు ఎప్పటికప్పుడు ఐకేపీ కేంద్రాల్లో పర్యటించి, తేమ నిర్ధారణ, తూకంలో మోసాల వంటి అంశాలను పరిశీలించాల్సి ఉన్నా..ఆఫీసు గేటు దాటి బయటికి రావడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో అమాయక రైతులు మోసపోవాల్సి వస్తోంది.

30 శాతమే సేకరణ

జిల్లాలో ఏప్రిల్ 28 నుంచి ఐకేపీ సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లు షురూ అయ్యాయి. 37 కేంద్రాలకు ఇప్పటి వరకు 29 కేంద్రాలే తెరుచుకున్నాయి. 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు 1,560.400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించారు. మెజార్టీ ధాన్యం ఇప్పటికీ కల్లాల్లోనే ఉండిపోయింది. అంతేకాదు ధాన్యం సేకరణ కోసం 15 లక్షల గన్నీ బ్యాగులు అవసరమవుతాయని అంచనా వేసి ఈ మేరకు 13 లక్షల బ్యాగులను సిద్ధం చేశారు. ఇప్పటి వరకు 28,723 బ్యాగులను మాత్రమే ఐకేపీ సెంటర్లకు తరలించారు. ఐకేపీ కేంద్రాలు సేకరించి లారీల్లోకి ఎత్తిన ధాన్యం కూడా రైస్ మిల్లుల ముందే బారులు తీరి ఉంది. తరుగు విషయంలో మిల్లర్లు పేచీ పెడుతుండటమే ఇందుకు కారణం.

మిల్లర్లు చెప్పిందే ధర

కేశంపేట, శంకర్‌పల్లిలో కొనుగోలు కేంద్రాలు ఇప్పటికీ తెరుచుకోలేదు. ఆయా ప్రాంత రైతులు తమ ధాన్యాన్ని నేరుగా మిల్లుకు తరలిస్తున్నారు. రైతుల్లో ఉన్న బలహీనతను మిల్లర్లు ఆసరాగా తీసుకుని క్వింటాల్‌కు రూ.1,700–1,800 చెల్లిస్తున్నారు. ఇక ఆమనగల్లు మార్కెట్ యార్డుకు రోజుకు మూడు వేలకుపైగా బస్తాల ధాన్యం వస్తోంది. ఇందులో 1,500 నుంచి 2,000 బస్తాలు మాత్రమే తూకం వేస్తున్నారు. మార్కెట్లో నిల్వలు రోజురోజుకూ పెరుగుతుండటంతో రైతులకు రోజుల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. అకాల వర్షం కురిస్తే ధాన్యం రాసులపై కప్పేందుకు అవసరమైన టార్పాలిన్లు కూడా లేవు. అంతేకాదు మార్కెట్లో క్వింటాలుకు ఐదు కేజీల వరకు తరుగు తీస్తున్నారు. మార్కెట్‌కు తాను ఇటీవల 90 బస్తాల ధాన్యం తీసుకురాగా, క్వింటాలుకు ఐదు కిలోల వరకు తరుగు తీశారని మేడిగడ్డతండాకు చెందిన ఇస్లావత్ జానకిరాం చెప్పారు.

ఆందోళనలో రైతులు

యాచారం మండలం మంతన్‌గౌరెల్లి కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 750 బస్తాలు సేకరించి మిల్లర్లకు పంపగా, దాంట్లో తేమ, తాలు శాతం ఎక్కువగా ఉందని మిల్లర్లు కొర్రీలు పెట్టడంతో ఆ ధాన్యమంతా అక్కడే నిల్వ ఉంది. యాచారం, చింతపట్ల కేంద్రాల నుంచి తరలించిన ధాన్యాన్ని కూడా తీసుకునేందుకు మిల్లర్లు నిరాకరిస్తున్నారు. దీంతో నిర్వాహకులు 40 కిలోల బస్తాకు..నాలుగు కేజీల తరుగు తీస్తున్నారు. ఇందుకు రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో నాలుగు రోజులుగా కొనుగోళ్లు నిలిపివేశారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు కొనుగోలు కేంద్రాల్లో పర్యటించి, సమస్యను పరిష్కరించాల్సి ఉన్నా ఇప్పటి వరకు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయి పర్యటనల పేరుతో తరచూ విధులకు గైర్హాజరవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.